పతంజలి విజ్ఞాపన విని ఫక్కున నవ్వాడు క్యాటరింగ్ మేనేజర్.

''లంచ్‌కి కర్రీస్ క్యారేజీలు సప్లయి చేసే పనికోసం మా దగ్గరకి వచ్చే ప్రతి ఒక్కరి దగ్గరా బళ్లుంటాయి! ఎందుకంటే ఆగమేఘాల మీద అందించడానికి. నువ్వేమో నీ దగ్గర బండి లేదంటున్నావాయే! ఎట్లా నీకు ఈ జాబ్ అప్పజెప్పమంటావు? కుదరదు కదా?'' అడిగాడు నొసలు ముడేసి .

వినయంగా చెప్పాడు పతంజలి..

''నా దగ్గర సైకిల్ ఉందండి. నేనుకూడా వాళ్లంత వేగంగానూ క్యారేజీలు అందించి రాగలనండీ!''.

''సైకిలా? ఏంవయ్యా తమాషా అనుకున్నావా? మా కస్టమర్లలో తొంభై తొమ్మిది శాతం మంది ముసలి వాళ్లుంటారు. పది నిమిషాలు లేటైతే చాలు ముప్పై ఫోన్లు వస్తాయి నాకు.. 'కర్రీస్ రాలేదింకా' అంటూ. బళ్లున్నవాళ్లే ఒక్కోసారి సమయానికి అందించలేక పోతుంటే.. నువ్వు.. ఆ పాత సైకిల్ మీద..!?'' వెటకారంగా నవ్వేశాడు మేనేజర్.

''నేను సైకిల్ రేసుల్లో పదిసార్లు స్టేట్‌ఫస్ట్ సర్. ప్రస్తుతం నేనున్న పరిస్థితుల్లో నాకు ఏదో ఓ ఉద్యోగం చాలా అవసరం సర్. ప్లీజ్!''.

పతంజలి వైపు ఆశ్చర్యంతోనూ, జాలితోనూ, అభినందనతోనూ చూశాడు మేనేజర్. మారు మాట్లాడక పతంజలికి జాబ్ ఇచ్చేశాడు.

గత పది సంవత్సరాలుగా తనకు తోడుగా తనతో పాటే కష్ట సుఖాలను అనుభవిస్తూ వస్తున్న తన సైకిల్ నేస్తాన్ని, తట్టి ఉత్సాహ పరుస్తూ..

''రాజా! నాకు ఎన్నో విజయాలనిచ్చి కడుపుని ఆనందంతో నింపావు. ఇప్పుడు కాలుతున్న మా దంపతుల కడుపుల్ని ఆహారంతో నింపు'' అని రెండు చేతులూ జోడించాడు.

తూర్పు తెల్లారకముందే లేచి కాలకృత్యాలు తీర్చేసుకుని, అన్నపూర్ణకి స్నానం చేయించి, తల దువ్వి, చీర మార్చి, పాక హోటల్ నుంచి రెండు ఇడ్లీలు తెచ్చి పెట్టి, అన్నం మాత్రం వండి, ఆదరాబాదరాగా కేటరింగ్ హౌస్‌కి చేరి, తన సైకిల్‌కి ఇరుపక్కలా సంచులలో కర్రీ ప్యాకెట్లని పెట్టుకుని, ఒకప్పటి తన శక్తిసామర్థ్యాలను గుర్తుతెచ్చుకుంటూ సైకిల్‌ను శక్తికొద్దీ తొక్కి, ప్యాకెట్స్ అందించి, పని పూర్తయ్యాక తిరిగి మేనేజర్‌కి కనిపించి, ఆయన వర్కర్లందరికీ ఫ్రీగా ఇచ్చే రెండు చల్లబారిన కర్రీ పొట్లాలతో ఇంటికి చేరడం.. పతంజలి నిత్యకృత్యం.

ఇంటికి చేరాక, కర్రీ పొట్లాలు విప్పి, గబగబా అన్నంలో కలిపి, ఆకలితో ఎదురుచూసే భార్యకి నాలుగు ముద్దలు తినిపించి, తనూ ఎంగిలి పడతాడు. ఇదీ దినచర్య.

తమ క్యాటరింగ్ హౌస్ కుక్ మాస్టర్స్ 'అద్భుతంగా' చేసే గుత్తి వంకాయ కూరని 'సరిగ్గా కస్టమర్లకి సరిపోయేంత మాత్రమే' చేయిస్తాడు మేనేజర్. ఆ కారణంగా తమకి ఆ కూర ఎన్నడూ దక్కదు. విచారించా





'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో విశిష్ట బహుమతి పొందిన కథ.